# సంకుచిత గ్రహణం

**సూర్యకిరణాలు** హేమంత ప్రత్యూషాన్ని వెంబడించాయి. ఇంక తెర విడిపోయి లోకం ప్రదర్శితమైంది.

కనకయ్య భవంతీ, ఊరి దేవాలయమూ, పూరిగుడిసెలూ, మురికివీధులూ, నైరాశ్యమే ఆహార్యంగ ధరించిన మానవాకారాలూ ఇప్పుడిప్పుడే స్పష్టం అవుతున్నాయి.

మూడంతస్తుల భవంతి, కనకయ్య భవంతి. పై అంతస్తు తూర్పు గదిలో పవళించి ఉన్నాడు కనకయ్య. మహావిష్ణువులా భాసిస్తున్నాడు.

ఆయనకేం తక్కువ? చుట్టుపట్ల చాలా ఉంది, ఇంకెవరికీ లేనంత.

ఈ రోజుల కథలు వ్రాసేవానికన్నా కథలు చెప్పేవాడు చెలామణి. ఇంకా హరికథలు చెప్పేవాడు ఇంగ్లీషు మణి.

కానీ కనకయ్య కథలు వ్రాసేవాడూ కాదు, చెప్పేవాడూ కాదు. వీళ్ళందరికీ అతీతుడు.

సూర్యునిచుట్టూ తిరిగే గ్రహాల్లా వీళ్ళంతా ఆయన చుట్టూ తిరగాలి. అలా రవిలా మెరవడానికి కావలిసిన ఇంధనం అతనివద్ద ఉంది. ఆ ఇంధనం పేరు డబ్బు.

అలాంటి కనకయ్యకు ఇపుడు కాస్త మెలుకువ వచ్చింది. కళ్ళు తెరిచాడు.

'నిజమే. ఉదయం అయింది.'

లేచాడు. గ్లాస్కో పంచెలో ఇరుక్కున్న వాడిపోయిన మల్లెపూలు ఆకలి బాధలతో చచ్చిన శవాల్లా జారిపోయాయి.

స్నానాల గది దిక్కు సాగాడు.

అతను సాగినా గాంభీర్యమే. ఆగినా గాంభీర్యమే. ఆర్థిక స్థైర్యం మనిషి సొగసు ఇనుమడింపజేస్తుందంటే నమ్మాలి. తప్పదు.

కింద రాలిన ఒక మల్లెపూవుపై కాలువేశాడు. అది చేసిన ఆర్తనాదం ఆధునికపు గాలికి తట్టుకోలేక, పాతకాలపు పురాణాల్లో ఇరుక్కుని కిక్కురుమనకుండా ఉంది, పాపం.

ఈ ఆధునికపు గాలి అంతటా వ్యాపించి అంతటా వీరవిహారం చేస్తూంది, మరి. ఇంక ఏ మలయ మారుతాన్ని రానిచ్చి నిలదొక్కుకోనిస్తుంది?

స్నానాల గదిలోనికి వెళ్ళిన కనకయ్య కాసేపటికి వెలపలికి వచ్చాడు.

మళ్ళీ అతని కాలు తమపై ఎక్కడ విరగబడిపోతుందో అని, చచ్చిన ఆ మల్లెపూల గుండెల్లోని దడదడశబ్దం గదినిండా నిండింది.

కానీ అతని కాళ్ళు ఆగాయి.

అతని కళ్ళు తదేకంగా ముందుకు చూస్తున్నాయి. ఎదురుగా కిటికీ నుండి బయటికి చూస్తున్నాడు. బాల్యచాపల్యాన్ని వదిలివేసిన వయసులా నిద్ర వదిలేసి నిశ్చలంగా చూస్తున్నాయి అతని కళ్ళు. అతనికి ఒక వైపరీత్యం కనిపిస్తూంది.

భూమిపై నడిచే జనం గాలిలో నడిచారనుకోండి అది వైపరీత్యం కాక మరేమవుతుంది?

ఆ భవంతి ముందు ఒక పూలతోట ఉంది. అది చాలా ఖరీదయింది. ఖరీదయిందన్నమాటే చాలు, అందాన్ని పుట్టిస్తుంది. ఇంక వేరే వ్రాయడం చర్విత చరణం.

తోటచుట్టూ ఇనప తీగెల కట్టవ ఉంది. లోపల సున్నంకొట్టిన ఇటికల కాలిబాట.

అంత అందంగా తోటను పెంచడంలో శ్రద్ధే కాకుండా శ్రమకూడా ధారపోయవలిసి వచ్చిందనడంలో అతిశయోక్తి లేదు. వివిధ రీతుల పూలమొక్కలను సేకరించేటప్పుడు దూరభారమనక కనకయ్య కష్టపడవలిసి వచ్చేది. కానీ అందాన్ని పెంచడం, అనుభవించడం ఒక తన సొత్తే అన్న విశ్వాసంలో అన్ని కష్టాలూ కరిగిపోయేవి.

అతని జీవితవిధానానికీ, ఈ తోటకూ ఇంతటి అవినాభావ సంబంధం ఉండటంవల్లనే ఊళ్ళోవాళ్ళకు అతనికన్నా, ఆ తోటంటే బెదురుగా ఉండేది. తోట సమీపానికి రావడం వాళ్ళకు మహాభయం.

అడుసు తొక్కనేల, కాలు కడగనేం?

అలాంటి స్థితిగతులలో ఈ పొద్దు, ఒక చిన్నపిల్ల —ఆరు ఏళ్ళు నిండాయో లేదో—పరిగెత్తుకుంటూ వచ్చి తోట కట్టవ గేటు తీసి లోపలికి వచ్చింది.

ఆ పిల్ల నదురు బెదురు లేకుండా అలా పరుగెత్తుకు రావడం కాలానికి కన్నం పడడంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

కనకయ్య చూచింది ఈ దృశ్యాన్నే—పురుగుకూడా అనుమతిలేనిదే ప్రవేశించ వీలులేని ఈ తోటలోనికి, ఎంతో స్వతంత్రంగా, తన స్వంత ఇంట్లోకి దుమికినట్లు, తన తల్లి ఒడిలోనికి జారినట్లు స్వేచ్ఛగా ఆ తోటలోనికి పరిగెత్తడం, సాధారణంగా జరిగే రక్తప్రసరణం శరీరంలో ఏదో అడ్డుతగిలి ఆగినట్టే అనుభూతి కలిగించింది.



**జి. హనుమంతరావు**

అతని నొసలు పాములా కదిలి బుసకొట్టింది. అతని భ్రుకుటి చీకటిలా ముంగి భయపెట్టింది.

ఆ పిల్ల ఎవరు? ఎందుకు వచ్చింది? ఎంత ధైర్యం!

లేమిలో అతను ఎప్పుడూ బాధపడలేదు. కానీ ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకునే ఓర్పులేమికి అతను ఇపుడు సతమతం అయిపోయాడు. ఆ పిల్ల పూవులపై చేతులు చాస్తున్న దృశ్యం చూచి ఇక ఉండబట్టలేక "ఆగు!" అని కేక వేశాడు.

ఆ కేకకు భయపడి బట్టలస్టాండ్‌పై నిలిచిన వల్లాటి చేతికర్ర అతనిచేతుల్లోనికి పోయి, 'అమ్మయ్య!' అని అనుకుంది!

కర్ర తీసుకుని చకచకా నడిచాడు కిందికి.

భవంతి మెట్లు పల్లకీ మోసే బోయీలలాగ అతను కిందికి దిగుతున్నకొద్దీ 'ఓహోం, ఓహోం!' అంటూ ఉద్యోగం నెరవేర్చాయి.

అతను పిల్లవద్దకు వచ్చాడు.

ఆ పిల్ల వేగం చూస్తే ఏదో పనిపాటా చేసుకునే సామాన్యుల పిల్లలా, సాధారణంగా కనిపించింది. పాత కనకాంబరం గౌను. దాని రంగు పోయింది. కానీ చిరగలేదు, మాయలేదు.

ఆ పిల్ల కళ్ళు పెద్దవి. ఎపుడు లేచిందో, ఏమో, అప్పుడే తల దువ్వుకుని శుభ్రంగా ఉంది. కళ్ళు నవ్వుతున్నాయో, పెదవులు నవ్వుతున్నాయో పరిశీలిస్తే గాని పోల్చుకోవడం కష్టం.

అతని "ఆగు" అన్న కేకకు అంతటి అందమైన భవంతి బిక్కముఖం పెట్టినా, ఈ పిల్లకు చీమ కుట్టినట్టయినా లేదు.

పువ్వుల్ని చూచి నవ్వుతున్న ముఖం నవ్వుతున్నట్టే

ఉంది.

ఇదేం పిల్ల? కనకయ్యకు ఒళ్లు మండింది. కర్రకింద కొట్టి టకటక మనిపించాడు.

"ఎక్కడ మీ ఇల్లు?"

"గుడివద్ద."

"ఏం కావాలి?'

"పూలు."

"ఎందుకు?" '

"పూజకు."

"ఈ తోట ఎవరిది?"

'ఈ తోట ఎవరికోసం? నీకోసం వేయించానా?' అన్న వ్యంగ్యం.

"మరి ఎవరికోసం?"

ఆశించని ఈ ఎదురు ప్రశ్న అతని మత్తు విడగొట్టింది. ఎవడో తనకన్నా బలం గలవాడు అతన్ని చెడాపెడా వాయించినట్టయింది. నేల తలకిందుగా రయ్‌మంటూ తిరిగింది.

తరతరాలుగా వస్తూన్న తన సంప్రదాయమూ, సంపాదనా, యాజమాన్యమూ అక్రమమనీ, ఇలాంటి సాంఘిక వ్యవస్థ ఇక కూడదనీ, ధిక్కరించి ఛిన్నాభిన్నం చేసేందుకు వచ్చే విప్లవ సైన్యంలా ఆ చెట్లు కనిపించాయి. దానికి నాయకత్వం వహిస్తూన్నట్లు ఆ చిన్నపిల్ల ప్రత్యక్షమయింది. చావు బతుకుల సమస్య ఉత్పన్నమైనట్లు అతనికి భ్రాంతి కలిగింది.

ఎద్దు రంకెవేసి దూకినట్లు, "ఆఁ, నీకోసం వేయించాను ఈ తోట. నీ తాత ముల్లెతో వేయించాను ఈ తోట!" అంటూ, ఆ పిల్ల రెక్కపట్టుకుని, చకచకా ఈడ్చుకుంటూ గేటుతీసి రోడ్డుపైకి విసిరినెట్టి, విసవిసా లోపలికి వెళ్ళిపోయాడు.

"అమ్మో, నా బిడ్డ! నా బిడ్డ!" అంటూ ఊడిపడింది ఆ పిల్ల తల్లి. కణతపై నెత్తురు చూచి కూలిపోయింది.

తల్లిరోదన. అది అరణ్యరోదన. చుట్టూ జనం అడివిలో చెట్లలాగ.

"ఏం జరిగింది? ఏం జరిగింది?" అంటూ వచ్చాడు లాల్చీ తొడుక్కున్న ఒక పెద్ద మనిషి. అపుడే ఇడ్లీ కాఫీ సేవించి వచ్చినట్టున్నాడు, చాలా తాపీగా ఉన్నాడు.

అతనికి ఎవరు జవాబు చెప్పాలి? ఏమని చెప్పాలి? ఏం జరిగిందో ఎవరు చూచారు?

ఆ తల్లి ఏడ్పు విని, అందరూ అప్పుడేగా చుట్టు మూగింది, కోళ్ల పందాల్ని చూచే గుంపులా.

యుగయుగాలుగా సూర్యుణ్ని మింగే రాహువులా సంస్కారాన్ని మింగాలని సంకుచితతత్వం యత్నిస్తూంది. తర్కం మాటున దాక్కోవాలని ప్రయత్నిస్తూంది.

దైవం ఇచ్చిన ఈ అందాల ప్రకృతిని ముక్కలు ముక్కలు చేసి, హద్దులుకట్టి దానిపై యాజమాన్యం కోసం పరాక్రమించమని ఉసిగొల్పే మానవుని బుద్ధిజాడ్యం, ఒక మాయలా ఆ ప్రాంతంలో ఆవరించి, ఆ గుంపులో ఆవేశించింది. ఆపైన "అంతా ఖర్మ! ఏం జరిగిందో ఏమో!" అని గుంపుచేత అనిపించడం ద్వారా తన టక్కరితనాన్ని నగ్నంగా దాస్తూంది. ఆ కన్న తల్లి ఆక్రందన, అసహాయతల మధ్య ముసి ముసిగా నవ్వుతూంది.

ఎంత నంగనాచి! ★




పెద్ద కెమిస్టులు, డ్రగ్గిస్టులు అందరి వద్దను లభిస్తున్నది

ఐ టెక్స
సౌందర్య దోహదములు
★ ఐటెక్స (కాటుక)
★ ఐటెక్స బిందీ
★ ఐటెక్స కుంకుం పేస్టు
తయారుచేసినవారు :
అరవింద్ లేబరెటరీస్
పో. బా. 1415 మద్రాసు-17


SOBHASYA
డౌవిడట్
కొరముట్లు
ప్రపంచ
బజార్లను
ఆకర్షించినవి

హిందుస్థాన్ డౌవిడట్ టూల్స్ లిమిటెడ్,
హెచ్. బ్లాక్, కన్నాట్ సర్కస్, న్యూ ఢిల్లీ-1.